ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24.05.2024 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి , గత ప్రభుత్వ పథకాల కు తిలోదకాలిస్తోందని బీఆర్ఎస్ నేత , సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు.
2. కొల్లాపూర్ లో బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య విషయంలో BRS తనపై చేసిన ఆరోపణలు నిరాధారమని రాష్ట్ర ఎక్సైజు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.
3. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా దేశ వ్యాప్తంగా రేపు జరిగే ఆరో విడత పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.
4. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈరోజు మొదలయ్యాయి.

**జగదీశ్ రెడ్డి-ఎమ్మెల్సీ ప్రచారం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి, గత ప్రభుత్వ పథకాల కు తిలోదకాలు ఇస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత , సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీనే ఇవ్వలేదని మాట దాటవేసిందని, వరి పంటకు బోనస్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా జగదీశ్ రెడ్డి ఈరోజు సూర్యాపేట జిల్లా కోర్టుల ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా

మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ప్రతి రోజు ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పాటు పడ్డారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి న తర్వాత ఐదు నెలల్లోనే రాష్ట్రంలో విద్యుత్ నిర్వహణను అస్తవ్యస్తం చేసిందని ఆరోపించారు.

(డెస్క్)

**JUPALLI KRISHNA RAO:**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య విషయంలో BRS తనపై చేసిన ఆరోపలు నిరాధారమని రాష్ట్ర ఎక్సైజు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ హత్యను BRS రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని మంత్రి ఆరోపించారు. హైదరాబాద్ లో కొద్ది సేపటి క్రితం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జరిగిన ఘటన విచారకరమన్నారు. మరణించిన వ్యక్తికి ఆర్థిక , భూసమస్యలు ఇంకా ఇతర సమస్యలున్నాయని మంత్రి తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలనీ, దోషులెవరైనా శిక్ష పడాలని అన్నారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు మాజీ మంత్రి తారకరామారావు , మాజీ IPS అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. BRS పార్టీ తనతో పాటు సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై రాజకీయ కక్షతో ఆరోపణలు చేస్తోందని మంత్రి వివరించారు. కాగా , శ్రీధర్ రెడ్డి హత్యను కాంగ్రెసు అధికార ప్రతినిధి మల్లు రవి తీవ్రంగా ఖండించారు..అత్యున్నత స్థాయిలో విచారణ జరిగాలని ఆయన కోరారు.

**(MSL)**

**SIXTH PHASE CAMPAIGNING**

8 రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాల్లో 58 లోక్ సభ నియోజక వర్గాల్లో రేపు జరిగే 6వ దశ పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పుర్తయ్యాయి. బీహార్ లో 8 స్థానాల్లో , హర్యాణాలోని మొత్తం 10

స్థానాల్లో, జమ్ము కశ్మీర్ లో ఒక చోట, ఝార్ఖండ్ లో 4 స్థానాల్లో, ఢిల్లీలోని మొత్తం 7 స్థానాల్లో, ఒడిసాలో 6 , ఉత్తర్ ప్రదేశ్ లో 14 , పశ్చిమ బెంగాల్లో 8 లోక్ సభ నియోజకవర్గాలో రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ప్రధానమంత్రి , బీజేపీ సీనియర్ నాయకుడు నరేంద్ర మోదీ , కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నిన్న హర్యాణాలోని మహేంద్రఘుడ్ లో, ఎన్నికల సభలో ప్రసంగించారు.
(ఎన్ఎస్డీ)

**కేటీఆర్-రేవంత్**

తన బంధువుకు 10 వేల కోట్ల రూపాయల కోవిడ్ డ్రగ్ కాంట్రాక్ట్ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధం చెప్పారని మాజీ మంత్రి బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు కె తారక రామారావు విమర్శించారు. గతంలో సచివాలయం కింద ఉన్న నిజాం ఆభరణాలను తవ్వినట్లు నకిలీ కథనాన్ని సృష్టించారని , కేంద్ర హోంమంత్రికి సంబంధించిన తప్పుడు వీడియోను సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి తప్పుడు వార్తలను సృష్టించడం అలవాటుగా మార్చుకున్న రేవంత్ రెడ్డిని ఎందుకు జైల్లో పెట్టకూడదంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ లో తారక రామారావు ప్రశ్నించారు.
(డెస్క్)

**నల్లగొండ-ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం**

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచార పర్వం రేపు సాయంత్రంతో ముగియనుంది. దీంతో వరంగల్ జిల్లాలో ప్రచారం తారా స్థాయికి చేరుకుంది. ఉప ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉండగా
బి ఆర్ ఎస్ పార్టీ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న , బీజేపీ నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ పడతున్నారు. ఈ క్రమంలో

వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత  రెండు రోజులుగా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు.  మూడు ప్రధాన పార్టీలకు  చెందిన ప్రజా ప్రతినిధులు, అగ్రనేతలు నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

(వరంగల్ జిల్లా పి టి సి)

**నాగర్‌కర్నూల్ - విత్తన మేళా**

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం ప్రాంతీయ పరిశోధన  కేంద్రంలో ఈరోజు విత్తన మేళ ప్రారంభమైంది. ఇందులో రైతులకు వ్యవసాయ సాగులో మెలకులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అలాగే రైతులకు కావలసిన నాణ్యమైన వరి     ,  వేరుశనగ,  జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, కందులు, తదితర విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఏడి హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల మూడో వారం నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. రైతులు ఈ లోగా అకాల వర్షాలకు తొందరపడి విత్తనాలు నాటుకోవద్దని సూచించారు.
(PTC నాగర్‌కర్నూల్ జిల్లా)

**RTC:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (  TGS RTC) కు సంబంధించి తప్పుడు లోగో సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన వారిపై ఆ సంస్థ కేసు నమోదు చేసింది. సంస్థ ప్రతిష్టకు భంగం కలిగేలా తప్పుడు లోగో ను సృష్టించి       ప్రచారం చేసిన ఘటనపై    RTC అధికారులు హైదరాబాద్ లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కొణతం దిలీప్, హరీశ్ రెడ్డి అనే వ్యక్తులపై IPC 469, 504, 505(1)(b)(c)తో పాటు IT యాక్ట్ లోని 67 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు ప్రస్తుతం కొనసాగుతోంది.
(MSL)

**యాదాద్రి భువనగిరి -తవ్వకాలు**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామంలో పురావస్తు శాఖ అధికారులు జరిపిన తవ్వకాల్లో బ్రాహ్మీ లిపిలో ఉన్న శాసనం బయటపడింది. ఈ శాసనం పై ప్రాకృత భాషలో అక్షరాలు రాసి ఉన్నట్లు అదికారులు వెల్లడించారు.

(పీటీసీ, యాదాద్రి భువనగిరి)

**సంగారెడ్డి కలెక్టర్-సమీక్ష**

ఖరీఫ్ సీజన్లో సంగారెడ్డి జిల్లాలో ఎరువులు , విత్తనాలు కొరత రాకుండా వ్యవసాయ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో వ్యవసాయ అధికారులతో ఈ రోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

(SANGAREDDY. PTC)

**జగిత్యాల-వరి ధాన్యం కొనుగోలు**

అకాల వర్షాలకు తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష తెలిపారు. జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా జిల్లాలోని పలు కేంద్రాల్లో 15 వేల 700 క్వింటాళ్ల ధాన్యం తడిసినట్టుగా గుర్తించారు.

(జగిత్యాల జిల్లా, పీటీసీ)

**ఇంటర్, పాలి సెట్ పరీక్ష:**

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ రోజు ప్రారంభం అయ్యాయి. పరీక్షలను సజావుగాగా నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు , ఆయా జిల్లాల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలి రోజు మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశాంతంగా జరిగింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరుగుతుంది. జూన్ 3వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 4 నుంచి జరుగుతాయని అధికారులు తెలిపారు. మరోవైపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఈ ఉదయం 11 గంటలకు మొదలైంది. రాష్ట్రంలోని 250 కేంద్రాలలో జరుగుతున్న ఈ పరీక్షకు 92వేల 808 మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

**(DESK)**

**సిరిసిల్ల-ఇంటర్ పరీక్షలు**

ఈరోజు ప్రారంభమైన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కు , రాజన్న సిరిసిల్ల జిల్లాలో 3 ,634 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు , జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మోహన్ తెలిపారు. వీరి కోసం జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు , తెలిపారు.

(పిటిసి రాజన్న సిరిసిల్ల )

**ఇంటర్ పరీక్షలు-సంగారెడ్డి**

రాష్ట్ర వ్యాప్యంగా నేటి నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను సంగారెడ్డి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఈ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. జూన్ 3 వరకు జరిగే ఈ పరీక్షలకు సంగారెడ్డి జిల్లాలో మొత్తం 14 వేల 886 మంది హాజరు కానున్నారు.

(SANGAREDDY. PTC)

వాతావరణం

రాష్ట్రంలో రేపటి నుంచి పగటి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే , ఈ రోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

పిఎస్

**సిరిసిల్ల-ఎస్పీ**

యువత క్రీడల్లో రాణించాలని , ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే దోస్తీ మీట్ -2024లో భాగంగా కబడ్డీ , వాలీబాల్ పోటీలను , సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ రోజు అయన ప్రారంభించారు. అలాగే జిల్లాలోసే 13మండలాల లో ప్రారంభమయ్యాయి.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)